# దేవుని కన్నా గొప్పవాడు




గంగుల నరసింహారెడ్డి

"నీ కుమారుడిది మహా గొప్ప జాతకం. కాని పన్నెండవ సంవత్సరాన ప్రాణగండముంది' అని ఆ కుర్రాడి చిన్నతనానే జ్యోతిష్కుం చెప్పాడో మహానుభావుడు. అప్పటి నుండి ఆ కుర్రాడి తల్లికి మనశ్శాంతి లేకుండా పోయింది. మత ప్రసక్తి లేకుండా కనిపించిన ప్రతి దేవునికి పూజలు చేసింది తన కుమారుడి ప్రాణగండం తప్పించమని.

కొన్ని రోజులకు ఆమె పూజలు ఫలించి ఆమె కలలో ఒక దేవుడు ప్రత్యక్షమయ్యాడు.

"స్వామీ, నా ప్రాణాలు తీసుకొనయినా నా కొడుకు ప్రాణాలు కాపాడు. వానికీ గండం తప్పించు" అంటూ ప్రార్థించిందామె.

ఆమె కుమారుడికి ఏ రకమయిన గండమున్నదో మనోనేత్రం ద్వారా తెలుసుకోవడానికి కాబోలు ఆ దేవుడు కొంతసేపు మౌనం వహించి మెల్లగా అన్నాడు "తల్లీ నీ కుమారుడికి గల ఆ గండం ఏ రైలు ప్రమాదానికి సం బంధించినదో అయి ఉంటే నేను రక్షించేవాన్ని......"

"అయ్యో స్వామీ" ఆక్రోశించిందామె.

"...అగ్ని ప్రమాదానికి సంబంధించినదయినా నేను ప్రయత్నించేవాన్ని......"

"మరెలా స్వామీ..."

"పాము కాటో, పడవ మునకో అయినా నేను అడ్డుపడేవాన్ని......"

"నీవే అలా అంటే నాకు దిక్కేది భగవంతుడా" రోదించిందామె.

"భయంకర రోగమైనా నేను ఆరోగ్యాన్ని ప్రసాదించేవాన్ని......"

"..............."

"ప్రకృతి బీభత్సమయినా నేను కాపాడేవాన్ని..."

"..............."

"......కానీ ఈ గండం నుండి మాత్రం నేను నీ కుమారుడిని కాపాడలేను తల్లీ, నన్ను క్షమించు నేనశక్తుడ్ని" సిగ్గుపడుతున్నట్లుగా అన్నాడా దేవుడు.

"అంతటి భయంకరమైన గండం ఏమిటది స్వామీ" విలవిల్లాడిపోతూ నీరసంగా ప్రశ్నించిందామె.

చెప్పాడు భగవంతుడు.

"ఆ" ఆశ్చర్యపోయిందామె. అదిరిపడిందామె.

బాధపడుతూ అదృశ్యమైపోయాడు దేవుడు.

అయినా ఆమె నిరాశపడదలుచుకోలేదు. మరో మతానికి సంబంధించిన దేవుడిని పూజించసాగింది తీవ్రంగా.

ఆ దేవుడు కూడా త్వరలోనే ప్రత్యక్షమయి "ఏం కావాలో కోరుకో తల్లీ" అన్నాడు.

చెప్పిందామె.

"మన్నించు తల్లీ, ఈ చావుకు తిరుగులేదు. దాన్ని తప్పించటం నాతరం కాదు" అంటూ అదృశ్య మైపోయాడా భగవంతుడు.

ఆమెకు తెలిసిన అన్ని మతాల దేవుళ్ళనూ ప్రార్థించింది. అందరూ ఇలాగే తమ అశక్తతను వెలిబుచ్చారు. చివరికి ఒక దేవుడు ఆమెకో సలహా ఇచ్చాడు. "అమ్మా, ఈ సృష్టికి భగవంతుడొక్కడే. ఆయనే ఈ సమస్త జీవరాశిని శాసించువాడు. మేమంతా ఆయన ప్రతినిధులం, దేవదూతలం మాత్రమే. ఆ దేవదేవుని ప్రార్థించి ప్రసన్నం చేసుకోగలిగితే నీ కుమారుడి ప్రాణాలు కాపాడుకోవచ్చు"

మళ్లీ చిగురించిన కొత్త ఆశలతో ఆ దేవదేవుని కొరకు నిద్రాహారాలు మాని ప్రార్థించసాగిందామె.

అస్పష్ట ఆకారంతో, అత్యద్భుత తేజోకాంతులతో ప్రత్యక్షమయ్యాడు దేవదేవుడు ఒకనాడు.

"నన్ను ప్రసన్నం చేసుకున్న వారిలో నీవే ప్రథమురాలివి, తల్లీ కోరుకో ఏం కావాలి?" అభయహస్తం ఇచ్చాడు దేవదేవుడు.

"దేవాధిదేవా, నాకు మణులు మాణిక్యాలు వద్దు, సిరిసంపదలు అసలే వద్దు. చిత్రమైన కోరికలు ఏవీ వద్దు"

"మరేం కావాలి తల్లీ"

"నా కుమారుడికి ఉన్న గండం నుండి కాపాడు. అదే నా కోరిక"

దేవదేవుని మొహం పాలిపోయింది. "ఈ ఒక్క కోరిక తప్ప ఇంకేదైనా కోరుకో తల్లీ, క్షణంలో తీర్చేస్తాను" అన్నాడు నీరసంగా

"అయ్యో నీవు కూడా ఇలా అంటే నా కింక దిక్కెవ్వరు దేవా, ఒక తల్లికి కొడుకు ప్రాణాల్ని మించిన గొప్ప కోరిక ఏముంటుంది" దీనంగా అందామె.

"అవునమ్మా నేను నీకన్న ప్రేమను అర్థం చేసుకోగలను. ఈ విషయంలో ఏమీ చేయలేని నిస్సహాయున్ని నన్ను క్షమించు తల్లీ"

"అంతేనా స్వామీ, నా ఒక్కగా నొక్క కుమారుడు నూరేళ్లు జీవించే అవకాశమే లేదా?" కంటికి మింటికి ఏకధారగా ఏడుస్తుందామె.

ఆలోచిస్తున్న వానిలా ఆమె వంక జాలిగా చూస్తూ కొంత సేపు మౌనం వహించాడు దేవదేవుడు. "నీ కొడుకు బ్రతకడానికి ఒక అవకాశం గోచరించు చున్నది తల్లీ" అన్నాడు తరువాత.

"ఏమిటది దేవా చెప్పుము" చిగురించిన ఆశతో అడిగిందామె.

"మానవ మాత్రుడొకడు నీ కొడుకు ప్రాణాలను కాపాడగలడు"

"నీ కన్నా గొప్పవాడయిన వాడు ఎవరతడు?"

"నిజంగా నా కన్నా గొప్పవాడే అతడు. ఎందుకంటే మీరే స్వయంగా తయారు చేసుకున్న దేవుడతడు. అతడే రాజకీయనాయకుడు!"

"రాజకీయనాయకుడా?!" ఆశ్చర్యంగా అడిగిందామె.

"అవును మతకల్లోలాల్లో చచ్చిపోయే చావును నివారించ గలిగే శక్తి ఒక్క రాజకీయ నాయకుడికే వుంది. ఇంకే దేవదేవునికీ లేదు. అతని దగ్గరికి వెళ్లి ప్రార్థించు. ప్రయోజన ముండవచ్చు" అని అదృశ్యమయ్యాడు దేవదేవుడు.